క్లుప్తంగా

డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

రామగిరి: ఆర్జీ–3 పరిధిలోని ప్రైవేట్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని శనివారం జీఎం కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ ఎంఆర్‌సీ రెడ్డి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. డ్రైవర్లు అనేక సమస్యలతో బాధపడుతున్నారని, టెండర్‌లో ప్రకటించిన విధంగా జీతాలు చెల్లించడం లేదని, సీఎంపీ ఎఫ్ పేరుతో కటింగ్ చేస్తున్న డబ్బులను చెల్లించాలని ప్రైవేట్ డ్రైవర్లతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం జీఎం సుధాకర్‌రావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ వై.వి.రావు, రామగుండం కాంట్రాక్ట్ వర్క్ రీజియన్ ఇన్‌చార్జి బుర్ర తిరుపతిగౌడ్, అసిస్టెంట్ సెక్రటరీ డీ.టీ.రావు, ఏపీఏ పిట్ సెక్రటరీ గంగాధర్, ఎస్‌అండ్‌పీసీ సెక్రటరీ కొమురయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో చేరండి



కరపత్రాలను చూపుతున్న అధ్యాపకులు

గోదావరిఖనిటౌన్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరాలని కోరుతూ కళాశాల ప్రిన్సిపాల్ పి.రాజేశ్ ఆధ్వర్యంలో శనివారం అధ్యాపకులు కరపత్రాల ద్వారా ప్రచారం నిర్వహించారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులతో విద్యాబోధన, ఎన్‌సీసీ, జాబ్ డ్రైవ్, జాతీయ సేవా పథకం తదితర విషయాలను ఇంటర్ పాసైన విద్యార్థులకు తెలియజేస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరి తమ బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని కోరారు.

బందంపల్లి చెరువును కాపాడండి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి శివారు బందంపల్లి చెరువు శిఖం భూమిని కొందరు ఆక్రమించుకుంటున్నారని, వారి చెర నుంచి కాపాడాలని రాష్ట్రీయ హిందూపరిషత్ జిల్లా అధ్యక్షుడు జాపతి రాజేశ్ కోరారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. బందపల్లి చెరువు సర్వేనెంబరు 262లో 65 ఎకరాలు, తాళ్లకుంట సర్వేనెంబరు 31లో 9 ఎకరాల 19గుంటలు ఉందన్నారు. పెద్దపల్లిని ఆనుకుని ఉన్న ఈ చెరువును కబ్జా చేసేందుకు కొందరు కుట్రలు పన్నుతున్నారని పేర్కొన్నారు. చెరువు భూమిని సర్వే చేయించి హద్దులు నిర్ణయించి కబ్జాదారుల నుంచి కాపాడాలని కోరారు.

వాహనాల తనిఖీ

ఓదెల: పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కనగర్తి, మడక, ఇందుర్తి గ్రామాల్లో ఎస్సై జి.అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం వాహనాలను తనిఖీ చేశారు. జమ్మికుంట నుంచి ఆయా గ్రామాల మీదుగా సుల్తానాబాద్, కాల్వశ్రీరాంపూర్‌ల వైపులకు వెళ్లే అనుమతి లేని పలు వాహనాలకు జరిమానా విధించారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి



విద్యార్థులతో డీవైఎస్‌వో సురేశ్

జూలపల్లి: గ్రామీణ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని డీవైఎస్‌వో సురేశ్ సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత బాలుర పాఠశాలలో నిర్వహిస్తున్న వాలీబాల్ వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి శిక్షణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచించారు. శిబిరం శిక్షకుడు బొమ్మెనవేని సతీశ్, శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులు ఉన్నారు.

తడిసిన ధాన్యం కొనాలి

పెద్దపల్లిరూరల్: జిల్లాలో కురిసిన వానకు తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రజాఫ్రంట్ జిల్లా కన్వీనర్ గుమ్మడి కొమురయ్య, కోకన్వీనర్ గాండ్ల మల్లేశం డిమాండ్ చేశారు. కష్టపడి పంట సాగుచేసిన రైతులు అమ్ముకునేందుకు కేంద్రాలకు వచ్చి అవస్థలు పడుతున్నారన్నారు. తేమపేరిట కొర్రీలు పెట్టి రోజుల తరబడి నిరీక్షించడంతో అకాల వర్షాలకు ధాన్యం తడిసిందని పేర్కొన్నారు. అధికారుల నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారిందన్నారు. వెంటనే కేంద్రాల్లో ఉన్న ధాన్యం నిల్వలను ఎప్పటిలాగే కొనాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రూ.500 బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు.

అకాల వర్షం.. రైతులకు తీరని నష్టం



కొనుగోలు కేంద్రంలో నిలిచిన వర్షం నీరు



బురదమయమైన కొనుగోలు కేంద్రం

- బురదమయమైన పెద్దంపేట కొనుగోలు కేంద్రం
- సకాలంలో లారీలు రాకపోవడంతో రైతుల పాట్లు
- సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న అన్నదాత

రామగుండం: మూడురోజులుగా కురుస్తున్న వర్షాలు అన్నదాతకు నిద్ర లేకుండా చేస్తున్నాయి. కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టిన ధాన్యం అకాల వర్షాలకు తడిసి ముద్దయ్యాయి. దీంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. కొనుగోలు కేంద్రం బురదమయంగా మారడంతో ధాన్యాన్ని వేరేచోటుకు తరలించడానికి నానా తంటాలు పడుతున్నారు.

రైతులకు అదనపు భారం..

అంతర్గాం మండల పరిధిలోని 16 గ్రామాల్లో సుమారు 5వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. నెల రోజుల క్రితం నుంచి దశలవారీగా వరికోతలు ప్రారంభం కాగా పెద్దంపేట, బ్రాహ్మణపల్లి గ్రామాల్లో రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టారు. ఇప్పటికే మండల పరిధిలో 95శాతం ధాన్యం మిల్లులకు తరలించగా మరో నాలుగైదు రోజుల్లో ప్రక్రియ పూర్తి కానుంది. మూడు రోజులుగా అకాల వర్షాలతో బ్రాహ్మణపల్లి, పెద్దంపేట గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టిన ధాన్యం పూర్తిగా తడిసింది.

ఆందోళనలో రైతులు

అకాల వర్షాలతో కేంద్రాల ప్రాంగణాలు పూర్తిగా బురదమయమై కనీసం ట్రాక్టర్ కూడా కేంద్రంలోకి వచ్చే పరిస్థితి లేదు. దీంతో ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు లారీలు కేంద్రంలోకి వచ్చే పరిస్థితి లేదు. దీంతో వేరే ప్రాంతానికి ధాన్యం తరలించే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. మరో నాలుగు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ పేర్కొంటుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. లారీ లోడింగ్ చేసేందుకు సులువైన ప్రాంతంలో నిల్వ చేసేందుకు కేంద్రంలో ఆరబెట్టిన ధాన్యాన్ని ఒక ట్రాక్టర్‌కు రూ.800 చెల్లించి ధాన్యం ఆరబెట్టేందుకు తరలిస్తున్నారు. దీంతో రైతులపై అదనపు ఆర్థిక భారం పడుతోంది.

పన్నెండు రోజులైంది



ధాన్యం ఆరబెట్టేందుకు పన్నెండు రోజుల క్రితం కేంద్రానికి తరలించాను. అప్పటికే కేంద్రంలో ధాన్యం రాశులు కుప్పలుగా ఉన్నాయి. నాకు మూడెకరాల విస్తీర్ణంలో నాలుగు ట్రాక్టర్ల ధాన్యం కేంద్రానికి తరలించాను. వరుస క్రమంలో తూకం వేసి మిల్లులకు పంపిస్తుండడంతో ఆలస్యమవుతోంది.

– మాదుగుల శంకరయ్య, రైతు, పెద్దంపేట

రైతులను ఆదుకోవాలి



పెద్దంపేట కొనుగోలు కేంద్రానికి తరలించిన ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు సరిపడా లారీలను ప్రభుత్వం కేటాయించలేదు. ఫలితంగా మిల్లులకు ధాన్యం తరలింపులో తీవ్ర జాప్యం జరుగుతోంది. నాకున్న రెండెకరాల్లో పండిన మూడు ట్రాక్టర్ల ధాన్యం కేంద్రంలో ఆరబెట్టాను. అధికారులు స్పందించి తక్షణమే కేంద్రంలోని ధాన్యాన్ని మిల్లులకు తరలించి రైతులను ఆదుకోవాలి.

– నాగపురి శ్రీకాంత్, రైతు, పెద్దంపేట

అధికారుల నిర్లక్ష్యంతోనే..



నేను ఏడెకరాలు కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాను. శుక్రవారం కురిసిన భారీ వర్షానికి ఆరబెట్టిన ధాన్యం పూర్తిగా వరద నీటిలో మునిగింది. మొత్తం 8ట్రాక్టర్ల ధాన్యం కేంద్రానికి తీసుకురాగా మరో నాలుగు ట్రాక్టర్ల ధాన్యం మిల్లుకు తరలించాల్సి ఉంది. ఎలాంటి కోతలు లేకుండా ధాన్యం కొనుగోలు చేసి మిల్లుకు తక్షణమే తరలిస్తే కాస్త ఊరట కలుగుతుంది.

– మారెల్లి కిషన్‌రెడ్డి, కౌలు రైతు, పెద్దంపేట

18లారీల ధాన్యం తరలింపు



రామగుండం, అంతర్గాం, పాలకుర్తికి నాలుగు మిల్లులు కేటాయించిన అధికారులు స్థానికేతర ప్రాంతాల నుంచి వచ్చే ధాన్యం సైతం మిల్లులు తీసుకుంటుండడంతోనే జాప్యం జరుగుతోంది. ఇప్పటివరకు 18 లారీల ధాన్యం మిల్లుకు తరలించగా మరో ఏడు తరలిస్తే పూర్తవుతుంది. అధికారులు స్పందించి తక్షణమే ధాన్యం తరలింపునకు అధిక లారీలను కేటాయించాలి.

– బి.కుమార్, ఎం.కుమార్, కేంద్రం ఇన్‌చార్జిలు

కొనుగోళ్లు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

కాల్వశ్రీరాంపూర్: రైతులు ఆందోళన చెందొద్దని, ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు రైతులకు భరోసా ఇచ్చారు. మండలంలోని వెన్నంపల్లి, మంగపేట, కూనారం గ్రామాల్లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే సందర్శించారు. ఇటీవల కురిసిన వడగళ్ల వానకు వరిధాన్యం తడిసిన విషయం సీఎం దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. గాలి దుమారానికి మామిడికాయలు నేలరాలాయని రైతులు అధైర్య పడొద్దన్నారు. తడిసిన వరిధాన్యాన్ని ఎలాంటి కోతలు లేకుండా వంద శాతం కొనుగోలు చేసేలా మిల్లర్లతో మాట్లాడుతానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. గత ప్రభుత్వ హయాంలో మాదిరి కోతలు ఉండవని, దోపిడి ఉండబోదని రైతులు నష్టపోవడం అనేది జరగదన్నారు. మాజీ ఎంపీపీ గోపగాని సారయ్యగౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా జనవేన సదయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వాసవీమాత జయంతి



అభిషేకం చేస్తున్న ఆర్యవైశ్యులు



కాల్వశ్రీరాంపూర్‌లో మంగళహారతి

సుల్తానాబాద్: పట్టణంలోని వాసవీమాత ఆలయంలో వాసవీమాత జయంతి వైభవంగా నిర్వహించారు. శనివారం వార్షిక వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఉదయం గణేశ్ పూజలతో వేడుకలు ప్రారంభమయ్యాయి. అనంతరం అమ్మవారికి అభిషేకం, హోమాలు, కుంకుమ పూజలు చేశారు. అమ్మవారి ఊరేగింపు వాసవీమాత ఆలయం నుంచి పోలీస్‌స్టేషన్ మీదుగా వేణుగోపాలస్వామి ఆలయం నుంచి వాసవీమాత దేవాలయం వరకు శోభాయాత్ర నిర్వహించారు. పూజారులు చంద్రశేఖర్ శర్మ, సంతోష్‌శర్మ ఆధ్వర్యంలో చేపట్టారు. హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

ఆర్యవైశ్య సంఘం నేతృత్వంలో..

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్ శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శనివారం వాసవీమాత జయంతి ఉత్సవాలు ఆర్యవైశ్య సంఘం నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు. వాసవి జననం, ఆత్మార్పణ ఘట్టం, ఆర్యవైశ్యుల ప్రాముఖ్యత అర్చకులు వివరించారు. అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, మారేడు దళాలతో, మామిడి పళ్లతో అలంకరణ చేశారు. మహిళలు వాసవీమాత స్తోత్రాలు పఠిస్తూ ఆలయ ప్రాంగణంలో గోధుమపిండి, నెయ్యితో జ్యోతులు వెలిగించారు. భక్తుల జయ జయ నినాదాలతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష కార్యదర్శులు రాఘవులు, అశోక్ పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



గణపతి ఆలయంలో హోమయజ్ఞం

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని శ్రీసంతోషిమాత, గణపతి ఆలయంలో శనివారం హోమయజ్ఞం, పంచామృతాభిషేకాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు భార్గవశర్మ ప్రత్యేక పూజలు, యజ్ఞం నిర్వహించారు.

కొత్తపల్లిలో..

పెద్దపల్లి మండలం కొత్తపల్లిలోని శ్రీచెన్నకేశవస్వామి ఆలయంలో శనివారం స్వామివారి కల్యాణం, హోమయజ్ఞం వైభవంగా జరిగింది. అర్చకులు కృష్ణమాచారి, శ్రీనివాస్, ఉపేందర్ పూజలు నిర్వహించారు.

పెద్దపల్లి మండలం సబ్బితం గ్రామంలో శ్రీరామాలయంలో శనివారం గీతాహవన యజ్ఞం నిర్వహించారు.

మహిళల భద్రత కోసం షీ టీం



అవగాహన కల్పిస్తున్న షీ టీం ఏఎస్సై మల్లారెడ్డి

యైటింక్లయిన్‌కాలనీ: మహిళల భద్రత కోసం షీ టీం పనిచేస్తుందని రామగుండం షీ టీం ఏఎస్సై మల్లారెడ్డి అన్నారు. శనివారం రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ సింగరేణి స్కూల్, వివేకానంద చౌరస్తా వద్ద షీ టీం బృందంతో కలిసి అవగాహన కల్పించారు. ఎవరైనా అసభ్యకరంగా మాట్లాడినా, ఇబ్బందులకు గురిచేసినా వెంటనే 100కు కాల్ చేసి పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. షీటీం 6303923700 వాట్సాప్ నంబర్‌కు షేర్ చేయాలని కోరారు. కానిస్టేబుల్స్ స్నేహలత, సురేశ్ పాల్గొన్నారు.

కోతుల దాడిలో వ్యక్తికి తీవ్ర గాయాలు

మంథని: మండలంలోని కన్నాలలో ముస్కుల విశ్వంబర్ రెడ్డి శనివారం తన ఇంటి సమీపంలో నడుచుకుంటూ వెళ్తుండగా సుమారు 50 కోతులు దాడి చేశాయని స్థానికులు తెలిపారు. ఈ ఘటనలో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయని, కాలి నరం దెబ్బతిన్నట్లు వైద్యులు చెప్పారన్నారు. అలాగే, మల్లేపల్లిలో నిశి అనే ఆరేళ్ల చిన్నారిపై కుక్క దాడి చేసి, గాయపర్చిందని పేర్కొన్నారు. మున్సిపాలిటీ, గ్రామాల్లో కోతులు వస్తువులను ఎత్తుకెళ్తున్నాయని, రోడ్డుపై వెళ్తున్నవారిని గాయపరుస్తున్నాయన్నారు. కుక్కల బెడద కూడా ఎక్కువైందని, అధికారులు వాటిని దూరంగా తరలించాలని కోరారు.

సంక్షిప్త వార్తలు

తారురోడ్డుకు మరమ్మతు చేయాలి

గోదావరిఖని: కోల్‌కారిడార్ రోడ్డు సరిగా లేక సింగరేణి కార్మికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. గోదావరిఖని నుంచి సెంటినరీకాలనీ వరకు కోల్ కారిడార్ రోడ్డు పూర్తిగా చెడిపోయి గుంతలుగా మారడంతో డ్యూటీలకు వెళ్లి వస్తున్న కార్మికులు రోడ్డు ప్రమాదాల బారినపడి గాయాలపాలవుతున్నారు. ఈవిషయంలో ఆర్జీ–2 సింగరేణి యాజమాన్యం పట్టించుకోవడం లేదని సీఐటీయూ నాయకులు ఆరోపించారు. తాజాగా శనివారం ఏఎల్‌పీగనిలో డ్యూటీ ముగించుకుని గోదావరిఖనికి వెళ్తున్న క్రమంలో ఓసీపీ–3 పాత బేస్‌వర్క్‌షాప్ వద్ద ప్రమాదం జరిగి ఇద్దరు కార్మికులు గాయపడ్డారు. ఆర్జీ–2 జీఎం స్పందించి రోడ్డు మరమ్మతు చేయాలని కోరారు. అలాగే రాత్రిపూట ప్రమాదాలు జరగకుండా వీధిలైట్లు కోల్‌కారిడార్ రోడ్డు వెంట ఏర్పాటు చేయాలని సీఐటీయూ నాయకులు ప్రవీణ్‌కుమార్, వినయ్, మొగిలి, వెంకన్న కోరారు.

కార్మికులకు నిత్యావసరాల పంపిణీ

ధర్మారం: మండల కేంద్రంలోని పంచాయతీ కార్మికులకు శనివారం యువజన కాంగ్రెస్ నాయకుడు దేవి అఖిల్ నిత్యావసరాలు పంపిణీ చేశారు. మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కాడే సూర్యనారాయణ, పాలకుర్తి రాజేశంగౌడ్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ దేవి జనార్దన్, చిరంజీవి, ఎల్లయ్య పాల్గొన్నారు.

ఉపాధి కూలీకి ఫిట్స్

ఓదెల: మండలంలోని లంబాడితండాకు చెందిన బానోతు తిరుమల శనివారం ఉపాధి పనులు చేస్తుండగా ఫిట్స్ వచ్చి అస్వస్థతకు గురైంది. సమీపంలో ఉన్న కార్యదర్శి ఆవుల శ్రీనివాస్ స్పందించి 108ను రప్పించి పెద్దపల్లి ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు. వైద్యసిబ్బంది తిరుమలకు వైద్యసేవలు అందించారు.

అందుబాటులో జీలుగ విత్తనాలు

జూలపల్లి: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లోని రైతులకు వర్షాకాలంలో అవసరమైన పచ్చిరొట్ట జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి ప్రత్యూష తెలిపారు. భూసారం పెంపులో కీలకమైన జీలుగ విత్తనాలు స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ఉన్నాయన్నారు. ప్రభుత్వ సబ్సిడీ పోగా 30 కిలోల సంచి రూ.1116 ఉందని, కావాల్సిన రైతులు పట్టాదారు పాసుబుక్‌తో వచ్చి తీసుకెళ్లాలన్నారు.

ఆలయంలో వైభవంగా ఎదుర్కోలు

ఎలిగేడు: మండలంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీమదలమేల్మంగా సమేత శ్రీవేంకటేశ్వర స్వామి తిరుకల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం ఆలయంలో వైభవంగా స్వామివారికి ఎదుర్కోలు నిర్వహించారు. సాయంత్రం స్వస్తి పుణ్యహావాచనం, అశ్వవాహన సేవ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భాగవతచరణ రేణువు రామిడి వెంకటరామిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, కొండల్‌రెడ్డి, నిరంజన్ రెడ్డి, సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఓదెలలో అవుసులకుంట అన్యాక్రాంతం

ఓదెల: ఓదెల గ్రామంలోని అవుసులకుంటను అదే గ్రామానికి చెందిన కొందరు అక్రమంగా అన్యాక్రాంతం చేశారని గ్రామానికి చెందిన పట్టాదారుడు వెలిశోజు ఆనందయ్య జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్యాం ప్రసాద్‌లాల్, పెద్దపల్లి ఆర్డీవో గంగయ్యకు శనివారం ఫిర్యాదు చేశారు. ఓదెల గ్రామానికి చెందిన రాజకీయ నాయకులు తహసీల్ కార్యాలయం సిబ్బంది అండదండలతో అవుసులకుంట కట్టపై నుంచి రహదారి తీయడంతో పాటు చెట్లను అక్రమంగా కొట్టి కబ్జాకు పాల్పడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అడిషనల్ కలెక్టర్ తహసీల్దార్, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం.

చికిత్స పొందుతూ యువతి మృతి

కమాన్‌పూర్: మండంలోని సిద్దిపల్లె పరిధిలోని బుర్రకాయలపల్లెకు చెందిన బొడ్డుపల్లి సింధుశ్రీ(19) చికిత్స పొందుతూ మృతి చెందింది. ఎస్సై చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. సింధుశ్రీ ఇంట్లో ఏ పనీ చేయడం లేదని ఈ నెల 15న తల్లి సరిత మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన ఆమె క్రిమిసంహారక తాగింది. కుటుంబసభ్యులు వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతిచెందింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

అన్నదానం

గోదావరిఖనిటౌన్: మార్కండేయకాలనీకి చెందిన రామిళ్ల రామలింగం–మంగళ దంపతులు చిన్న కుమారుడు రవీంద్రకుమార్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం రాత్రి విఠల్‌నగర్‌లోని అమ్మ పరివార్ అనాథ పిల్లలకు, వృద్ధులకు అన్నదానం చేశారు.

దుర్గాదేవి ఆలయంలో మాజీ మంత్రి పూజలు

గోదావరిఖనిటౌన్: స్థానిక జవహర్‌నగర్‌లోని జయ దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ దంపతులు శనివారం ఆలయంలో ప్రత్యేక పూజలు, గణపతి హోమం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. నాయకులు పెంట రాజేశ్, అచ్చె వేణు, భక్తులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యం



రొంపికుంట కేంద్రంలో తడిసిన ధాన్యం

కమాన్‌పూర్: మండలంలో శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షానికి కొనుగోలు కేంద్రాలో పోసిన ధాన్యం తడిసిపోయింది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పోసి నెలరోజులైనా తూకం పెట్టకపోవడంతో అకాల వర్షానికి ధాన్యం రాశుల కిందికి వరద నీరు చేరి ధాన్యం తడిసిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

'దోస్తు'ను నిలిపివేసిన యూనివర్సిటీ అధికారులు

గోదావరిఖనిటౌన్: అనుమతి లేని ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాలపై చర్యలు తీసుకోవాలని, దోస్తు ప్రక్రియను రద్దు చేయాలని కోరుతూ ఇటీవల శాతవాహన యూనివర్సిటీ వీసీకి ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రేణికుంట్ల ప్రీతం వినతిపత్రం అందజేశాడు. స్పందించిన వీసీ, అధికారులు విచారణ జరిపి దోస్తు ప్రక్రియను నిలిపివేసినట్లు శనివారం ప్రీతం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు స్పందించి విద్యార్థుల భవిష్యత్ కాపాడారని అన్నారు.

21న ఇసుక వేలం

ముత్తారం: మండలంలోని ఖమ్మంపల్లిలో పట్టుకున్న మానేరు ఇసుక 21న వేలం వేయనున్నట్లు తహసీల్దార్ సుమన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ముందుగా రూ.5వేలు ధరావత్ చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు.

బోరుకు మరమ్మతు



ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ రమ

మంథని: మున్సిపల్ పరిధిలోని 11వ వార్డు(మర్రివాడ)లో కొన్నిరోజులుగా నిరుపయోగంగా ఉన్న బోరుకు మరమ్మతు చేసి వినియోగంలోకి తీసుకొచ్చారు. బోరు మరమ్మతుకు చేరినా ఎవరూ పట్టించుకోకపోవడంతో వార్డులో నీటి సమస్యతో స్థానికులు ఇబ్బంది పడ్డారు. స్థానిక కౌన్సిలర్ ద్వారా మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రి రమ దృష్టికి తీసుకెళ్లగా బోర్ మరమ్మతు చేయించి నూతన మోటారు అమర్చారు. శనివారం నుంచి నీటి వినియోగం ప్రారంభించారు. మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లకు వార్డుప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. వైస్‌చైర్మన్ సీపతి బానయ్య, కౌన్సిలర్ వీకే.రవి, కాంగ్రెస్ నాయకుడు పాపారావు ఉన్నారు.

నేత్రదానం చేయడానికి ముందుకు రావాలి



అభినందన పత్రం అందిస్తున్న ప్రతినిధులు

పాలకుర్తి: నేత్రదానం చేసేందుకు దాతల ముందుకు రావాలని సదాశయ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి డాక్టర్ ఎం.భీష్మాచారి, అనంతరాములు కోరారు. ఈ మేరకు శనివారం పాలకుర్తి మండల పరిధిలోని జీడీనగర్‌కు చెందిన తాటిపాముల వెంకటేశ్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా అయన నేత్రాలను దానం చేశారు. ఈ సందర్భంగా సదాశయ ఫౌండేషన్, కమాన్‌పూర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నేత్రదాత సంస్మరణ సభ నిర్వహించి నేత్రదాతకు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళి అర్పించారు. అనంతరం నేత్ర, అవయవ, శరీర దానాలపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. మృతుడి కుటుంబసభ్యులు భీమనపల్లి పృథ్వీరాజ్, నేత్రదాత సతీమణి స్వరూప, కుటుంబసభ్యులు బిల్ల సాయి, మేఘన, రమేశ్, శంకరయ్య, గడ్డం రమేశ్ తదితరుల సమక్షంలో అభినందన పత్రం అందజేశారు. ఫౌండేషన్ ప్రతినిధులు శ్రవణ్‌కుమార్, లింగమూర్తి, నూక రమేశ్, దేవి లక్ష్మీనర్సయ్య, బూర్ల మల్లేశం, మీడియా సలహాదారు కేఎస్.వాసు ఉన్నారు.

విద్యుత్‌షాక్‌తో రెండు గేదెలు మృతి

ఎలిగేడు: మండలంలోని శివపల్లిలో రెండు గేదెలు(బర్రెలు) విద్యుత్ షాక్‌తో మృతి చెందాయి. గ్రామానికి చెందిన దుగ్యాల వెంకట్రావుకు చెందిన రెండు గేదెలు పొలంలో మేత మేస్తుండగా ఎల్‌టీ లైన్ తెగిపోయి మేత మేస్తున్న గేదెలపై పడింది. దీంతో గేదెలు అక్కడికక్కడే మృతి చెందాయి. గేదెల విలువ రూ.లక్ష ఉంటుందని బాధిత రైతు వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాడు. ప్రమాదవశాత్తు ఎల్‌టీ లైన్ తెగిపడి మృతి చెందిన గేదెల నష్టం అంచనా వివరాలను నమోదు చేసి ఉన్నతాధికారులకు నివేదిక అందజేయనున్నట్లు విద్యుత్ ఏఈ సంపత్‌రెడ్డి తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెద్దపల్లిరూరల్: పట్టణంతో పాటు రంగంపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో ఆదివారం మరమ్మతు కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఏడీఈ సత్యనారాయణ తెలిపారు. పట్టణంలోని సుభాష్‌నగర్, కమాన్‌రోడ్, వేంకటేశ్వరస్వామి టెంపుల్‌రోడ్ ప్రాంతాల్లో ఉదయం 7నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

14, 39వ డివిజన్ పరిధిలో..

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 14, 39వ డివిజన్ పరిధిలో 11కేవీ విద్యుత్ లైన్ మరమ్మతు పనుల దృష్ట్యా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ మహిపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఆయన పేర్కొన్నారు.

స్విమ్మింగ్‌పూల్ వినియోగంలోకి తీసుకురావాలి



ధర్నా చేస్తున్న నాయకులు

గోదావరిఖని: ఆర్జీ–2 ఏరియాలోని స్విమ్మింగ్ పూల్ వినియోగంలోకి తీసుకురావాలని కోరుతూ ఏఐటీయూసీ నాయకులు శనివారం జీఎం ఆఫీస్ ఎదుట ధర్నా నిర్వహించారు. స్విమ్మింగ్ పూల్ కోసం పాస్‌లు జారీ చేసిన అధికారులు స్విమ్మింగ్‌ను సరిగా నిర్వహించడం లేదని ఏఐటీయూసీ నాయకులు రాజరత్నం విమర్శించారు. ఇప్పటికైనా సింగరేణి యాజమాన్యం స్పందించి వేసవికాలం సెలవులు పూర్తయ్యేదాకా స్విమ్మింగ్‌పూల్ సరిగా నిర్వహించాలని కోరారు. నాయకులు జీగురు రవీందర్, అన్నారావు, శ్యాంసన్, సాంబశివరావు, ఆవుల రవికుమార్ పాల్గొన్నారు.